# పాలన చేతకాక నోటీసుల డ్రామా

- కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్
- కేసీఆర్‌తో పెట్టుకుంటే కొరివితో తలగోక్కున్నట్లే
- కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్


ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మెంగని మనోహర్

ముస్తాబాద్, మే 22: కాంగ్రెస్‌కు పాలన చేతకాక కాళేశ్వరం ప్రాజెక్టుపై విష ప్రచారం చేస్తూ నోటీసుల డ్రామా ఆడుతున్నదని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామితో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మళ్లించేందుకే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని దుయ్యబట్టారు. హామీల అమలు చేయాలని నిలదీస్తున్న ప్రజల దృష్టిని మరల్చి పూట గడుపుకునే ప్రయత్నమే ఈ నోటీసు డ్రామా అని ధ్వజమెత్తారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ అని ఎద్దేవా చేశారు. సమైక్య పాలనలో ఎడారిగా మారిన తెలంగాణ కోసం ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని, తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఆయనకు నోటీసులు ఇవ్వడం అంటే యావత్ తెలంగాణను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు లేక ఆగమైన వ్యవసాయాన్ని కాళేశ్వరం ప్రాజెక్టుతో పండుగలా మార్చారని, రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కేసీఆర్ అంటే తెలంగాణ ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న గొప్ప నాయకుడని, ఆయనతో పెట్టుకోవడం అంటే కొరివితో తల గోక్కోవడమేనని హెచ్చరించారు. ఈ నోటీసుల వల్ల ఒరిగేదేంలేదని, పోయేదేమి లేదన్నారు. ప్రజలు విజ్ఞులని, వారికి అన్నీ తెలుసునని, రేపు ఏ ఎన్నిక వచ్చినా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టడానికి సిద్ధంగా ఉన్నారని వివరిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయిందని, మరో 20 ఏండ్లయినా అధికారంలోకి వచ్చేది లేదని తెలిసే ఆ పార్టీ నేతలు వచ్చినకాడికి దండుకొని బయటపడే ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో తుమ్మనపల్లి శేఖర్ చారి, మొలిగె మహేందర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మత్స్యశాఖ జిల్లా అధికారితో మత్స్యశాఖ మహిళ సభ్యులు

వేములవాడ రూరల్, మే 22: మత్స్యపారిశ్రామిక సహకార సంఘా లు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య పేర్కొన్నారు. బుధవారం నూకలమర్రిలో నిర్వహించిన నూతన మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల అవగాహన సదస్సుకు హాజరై, మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ముందుకెళ్లేందుకు సంఘటితమై ముందు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎఫ్‌డీపీ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లను డీఎఫ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి మత్స్యకిసాన్ సమృద్ధి సహ్ యోజన కింద 8 గ్రామాలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. అనంతరం ఆమెను సభ్యులు సత్కరించారు. ఇక్కడ జిల్లా మత్స్యశాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం, వైస్ చైర్మన్ అంబటి శేఖర్, ఉమెన్స్ సొసైటీ అధ్యక్షురాలు పెంద్యాల దీపిక, ఉపాధ్యాయురాలు వైశాలి, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పెంద్యాల శంకర్, డైరెక్టర్లు తిరుపతి, పర్శరాములు, నరేస్, ఎఫ్ఎఫ్‌వో కిరణ్, ఫీల్డ్ ఆఫీసర్ శివ, వెంకటేశ్ పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం

- జిల్లాలో దంచికొట్టిన వాన
- కేంద్రాల్లోనే తడిచిపోయి, కొట్టుకుపోయిన ధాన్యం
- రైతులు లబోదిబో
- తడిసిన వడ్లు కొనాలని డిమాండ్
- రేపాకలో కూలిన పురాతన ఆలయం పై కప్పు


సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

రాజన్న సిరిసిల్ల, మే 22 (నమస్తే తెలంగాణ)/ ఇల్లంతకుంట/బోయినపల్లిరూరల్: అకాల వర్షం.. రైతన్నకు అపార నష్టాన్ని తెస్తున్నది. ఆరుగాలం కష్టాన్ని నీళ్లపాలు చేస్తున్నది. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వానతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం, తూకం వేసిన బస్తాలు ఎక్కడికక్కడ తడిసి ముద్దవుతుండగా, రైతన్న గుండె చెరువవుతున్నది. కన్నీరే మిగులుతున్నది. గురువారం సాయంత్రం జిల్లా అంతట వాన దంచికొట్టింది. గంట పాటు ఏకదాటిగా కురిసింది. మధ్యాహ్నం 12గంటలకు ఓ చోట ఉంటే, మరోచోట కురవలేదు. సాయంత్రం మళ్లీ 5గంటలకు ప్రారంభమైన వర్షం కొన్ని మండలాల్లో మోస్తరుగా, మరికొన్ని మండలాల్లో భారీగా పడింది. ఈదురు గాలులు వీయగా, పిడుగుల శబ్దాలు వినిపించాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్, పాతబస్టాండ్ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది.

### తడిసిన ధాన్యం

సాయంత్రం కురిసిన వర్షానికి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఓ రైతుకు చెందిన ధాన్యం కొట్టుకుపోయింది. కుప్పపై ప్లాస్టిక్ కవర్లు కప్పినప్పటికీ భారీ వర్షానికి చిరిగిపోవడంతో ధాన్యం తడిసి పోయినట్లు రైతులు తెలిపారు. సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరు ఐకేపీ సెంటర్‌లో వర్షానికి బురదమయంగా మారింది. నడవలేని పరిస్థితి నెలకొంది. ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లపై నిలిచిన నీరును వర్షంలోనే రైతులు ఎప్పటికప్పుడు ఎత్తిపోసుకోవడం కనిపించింది. ఇన్ని రోజులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దగా మారడంతో అధికారులు కొంటరోలేదోనన్న రందీ రైతులకు పట్టుకున్నది. అకాల వర్షాలు తమ పాలిట శాపంగా మారాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానకు తడిసిన ధాన్యం కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులోని కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు చేరి ధాన్యం తడిసింది. ఈదురు గాలులకు రేపాకలోని పురాతన నర్సింహాస్వామి ఆలయం పై కప్పు కూలిపోయింది. వర్షాలు కురుస్తున్నా కొనుగోళ్లు నత్తనడకన నిర్వహించడం సరికాదని, అధికారులు, ఎమ్మెల్యే స్పందించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌ది పర్సంటేజీల పాలన

- కాళేశ్వరంపై విష ప్రచారం మానుకోవాలి
- కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్


గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న భాస్కర్‌గౌడ్

సిరిసిల్ల రూరల్, మే 22: కాంగ్రెస్ ప్రజా పాలన చేస్తామని చెప్పి, పర్సంటేజీల పాలన కొనసాగిస్తున్నదని కేటీఆర్ సేన తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్ ఆరోపించారు. గురువారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ(టెక్స్‌టైల్ పార్క్)లో కేటీఆర్ సేన గ్రామ కమిటీ నియామకం సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిందని, హామీలు అమలు చేయాలని నిలదీస్తున్న ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాళేశ్వరం రూపంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకే గర్వకారణమని, సుప్రీం కోర్టు సైతం అద్భుతమని ప్రశంసించిందన్నారు. ప్రాజెక్టుపై విష ప్రచారం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆధర్మం పైన ఎప్పుడూ ధర్మమే గెలుస్తుందన్నారు. అనంతరం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మెరుగు శేఖర్‌ను కండువా కప్పి ఆహ్వానించారు. ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నేత వేముల శ్రీనివాస్, అల్వాల సాయిరాం, సాదుల భాస్కర్, జక్కని రమేశ్, వేముల సాగర్, సదానందం, రవి, నర్సయ్య, అంబదాస్, మాదాసు సత్యం, నర్సయ్య, మేరుగు శేఖర్, రాజు, కేటీఆర్ సేన నాయకులు మామిడాల విజయ్, రేగుల రాజు, తౌటి శివకృష్ణ, ఉమాశంకర్ ఉన్నారు.

### ఇందిరమ్మకాలనీ కమిటీ సభ్యులు వీరే

ఇందిరమ్మకాలనీ(టెక్స్‌టైల్‌పార్క్) కేటీఆర్ సేన గ్రామ కమిటీని గురువారం నియమించారు. అధ్యక్షుడిగా వేముల నరేష్, ఉపాధ్యక్షుడిగా గడ్డం కిరణ్, ప్రధాన కార్యదర్శిగా వేముల కిషన్, కార్యదర్శిగా సామల ప్రశాంత్, సలహాదారునిగా వేముల వెంకటేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మేర్గు తిరుపతి, కోశాధికారిగా నాగయ్యను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి నియామకపత్రాలను అందించి, అభినందించారు.

## చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి


పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

రుద్రంగి, మే 22: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా సరిహద్దులో మానాల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. గురువారం చెక్ పోస్టును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

## రైతుల ఇబ్బందులు పట్టవా..?

ఇల్లంతకుంట రూరల్, మే 22: కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతగాక రైతులను అరిగోసపుచ్చుకుంటున్నదని బీఆర్ఎస్ ఇల్లంతకుంట పట్టణ అధ్యక్షుడు కూనబోయిన రఘు ఒక ప్రకటనలో మండిపడ్డారు. ధాన్యం కేంద్రాలకు తెచ్చి రోజులు గడుస్తున్నా కొనకపోవడం, కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యంతో వడ్లు మొలకెత్తి తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నాలుగైదు రోజులుగా వర్షాలు పడుతుండడంతో మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి రైతులకు కన్నీరే మిగిలిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి, తడిసిన ధాన్యాన్ని సైతం కొనాలని డిమాండ్ చేశారు.

## నూతన కమిటీ

ఎల్లారెడ్డిపేట, మే 22: తిమ్మాపూర్‌లోని రాజ్యానాయక్ తండాలో సేవాలాల్ తండా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా రాజు, ప్రధాన కార్యదర్శిగా భూక్యా బాపురావు, కార్యవర్గ సభ్యులుగా భూక్యా లింగమూర్తి, భూక్యా రాంరెడ్డి, భూక్యా తిరుపతి, బానోత్ గణేశ్, భూక్యా రాజు, మాలోత్ జగన్, అంగోత్ లచ్చిరాం, భూక్యా శ్రీరాంను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

## తంగళ్లపల్లిలో జీలుగ విత్తన కేంద్రం

సిరిసిల్ల రూరల్, మే 22: తంగళ్లపల్లిలోని మహిళా వీవో భవనంలో జీలుగ విత్తనాల పంపిణీ కేంద్రాన్ని సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూపరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని మహిళా సంఘాలు నిర్వహిస్తాయని చెప్పారు. ఈ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నదని, ఎరువు రూపంగా ఉపయోగించుకొని పంట దిగుబడి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరేల్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రవీణ్, ఎంపీఎం చంద్రయ్య, ఏవో సందీప్, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్, కవిత, శోభా, అధికారులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో వివాహిత మృతి


శోభ (ఫైల్)

బోయినపల్లిరూరల్, మే 22: విద్యుదాఘాతంతో వివాహిత మృతిచెందిన ఘటన నీలోజిపల్లిలో గురువారం జరిగింది. ఏఎస్ఐ మోతే రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర శోభ(45) స్నానం కోసం బాత్రూం వెళ్లింది. అక్కడ అప్పటికే తెగి ఉన్న విద్యుత్ వైర్లను చూడక డోరు తీసే క్రమంలో వాటికి తాకి అక్కడికక్కడే మృతిచెందింది. శోభ భర్త రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శోభ కుటుంబసభ్యులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

## వసతులు కల్పించండి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వేములవాడ, మే 22: వేములవాడ పట్టణంలోని వైకుంఠధామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు గురువారం మున్సిపల్ కార్యాలయ మేనేజర్ సంపత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కనీసం నీటి వసతి లేకపోవడం, మరుగుదొడ్లకు తాళం వేసి ఉండడంతో అంతిమ సంస్కారాల కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే బోరుబావిని ఏర్పాటు చేయాలని, ఇతర వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు కడారి రాములు, కుమ్మరి లక్ష్మణ్, మహేశ్ ఉన్నారు.

## మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మిస్తాం

వీర్నపల్లి, మే 22: మారుమూల అటవీ మండలంలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మిస్తామని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గురువారం పరిశీలించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఇక్కడ సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ ఎల్లాగౌడ్, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ రాజశేఖర్ ఉన్నారు.

## కోనరావుపేటలో చోరీ

కోనరావుపేట, మే 22: మండలకేంద్రంలోని కిరాణం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మరిమడ్ల గ్రామానికి చెందిన పుల్కం జలేందర్ మండల కేంద్రంలో కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం వేళలో దుకాణానికి తాళం వేసి మరిమడ్ల గ్రామానికి వెళ్లాడు. రాత్రి గుర్తు తెలియని దుండగలు దుకాణంలో చొరబడి రూ.30వేల విలువైన సామగ్రి, రూ.8వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాహుల్ రెడ్డి డ్యాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహా చండీయాగాన్ని జయప్రదం చేయాలి

వేములవాడ టౌన్, మే 22: ఉద్యమకారుల కుటుంబాలు ఆయురారోగ్యాలు, సిరిసంపదతో సంతోషంగా ఉండాలని కాంక్షిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వచ్చేనెల 14, 15 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే మహాచండీయాగాన్ని జయప్రదం చేయాలని ఉద్యమకళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు యెల్ల పోశెట్టి కోరారు. గురువారం రాజన్న ఆలయం ఎదుట కళాకారులతో కలిసి మహాచండీయాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తిమ్మాపూర్ మండలం తపాలా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేదిక కావడం తమ అదృష్టమని, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు అయిల ప్రసన్న, రాజన్నసిరిసిల్ల జిల్లా నియోజకవర్గం ఇన్‌చార్జి వెంగల శ్రీనివాస్, అధ్యక్షుడు బొజ్జ కనకయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Dandem Sumalatha W/o Mysaiah (Old Name), H.No. 3-11, R/o Rajannapet, Yellareddypet Mandal, Rajanna Sircilla Dist. My Name is changing to **Bathula Renuka W/o Mysaiah D/o Yellaiah** (New Name)
NTK-330317

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


## ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 22: రాజన్న ఆలయ విస్తరణ పనులు ప్రణాళికాబద్ధంగా చేపడతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో 484 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ఏటా నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు నెల రోజుల్లో పనులు ప్రారంభించాలన్నారు. ఇక్కడ హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య

చందుర్తి, మే 22: అనారోగ్యంతో దవాఖానలో చేరి చికిత్స పొందిన నర్సింగాపూర్‌కు చెందిన ఒగ్గు అఖిలకు రూ.36వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకాగా, గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అందజేశారు. ఎల్లయ్య మాట్లాడుతూ సాయం మంజూరుకు కృషి చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సీనియర్ నాయకులు మరాటి మల్లిక్, బైరగోని రమేశ్, ఎండీ ఇస్మాయిల్,గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యాల నరేష్, బండి శ్రవణ్ కుమార్, సంపునూరి మురళి, అంజయ్య ఉన్నారు.

## వైద్య శిబిరం తనిఖీ

వీర్నపల్లి, మే 22: మండలంలోని కంచర్లలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రజిత గురువారం సందర్శించారు. జ్వర బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉంచకూడదని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో 72మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 51మంది రక్త నమూనాలు సేకరించినట్లు మండల వైద్యాధికారి సరియా అంజుమ్ తెలిపారు.

# డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- పలు శాఖల అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

కలెక్టరేట్, మే 22: జిల్లాలో మాదకద్రవ్యాలు (డ్రగ్స్) నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేశ్ బి గితే, ఇతర అధికారులతో కలిసి నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన ప్రచారం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాఠశాల పరిసరాల్లో ఉన్న పాన్ షాప్, తదితర దుకాణాలపై నిఘా పెట్టాలని సూచించారు. స్కూల్స్, కళాశాలల పునఃప్రారంభం జరిగిన తర్వాత డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలీ బేగం, అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎక్సైజ్ విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని జిల్లా రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) సేవలు, ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాల నమోదు తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందించిన సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఇతర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ గడువు తేదీ 8.5.2025 నాటికి ముగిసిన నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకోవాలని సూచించారు. వేములవాడలోని ఏరియా హాస్పిటల్ ఆవరణలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు, ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రాయకరరావు వేణు కుమార్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల శివప్రసాద్, కోశాధికారి బుడిమె శివప్రసాద్, కమిటీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, యెల్లె లక్ష్మీనారాయణ, దేవులపల్లి రాజమల్లు, చిదుర నాగశంకర్, కమటాల రాఘవేందర్ పాల్గొన్నారు.

# వేములవాడ కాషాయమయం

- తరలివచ్చిన దీక్షాపరులు
- జిల్లాలో ఘనంగా హన్మాన్ పెద్ద జయంతి


ఆలయంలో బారులు తీరిన దీక్షాపరులు

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ రాజన్న ఆలయం కాషాయమయమైంది. గురువారం హన్మాన్ పెద్ద జయంతి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన హనుమాన్ దీక్షా పరులతో కిక్కిరిసి పోయింది. కాగా, ఆలయంలో ఏర్పాట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయని, దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టిందని, ప్రసాదాల కౌంటర్‌వద్ద లడ్డూ రెండు గంటలపాటు నిలబడ్డామని పలువురు హనుమాన్‌దీక్షాపరులు పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని, మరో రెండు ప్రసాదాల కౌంటర్‌లను ఏర్పాటు చేస్తే ఇలాంటి ఇబ్బందులు వచ్చేవికావని సిద్దిపేటకు చెందిన అజయ్ అనే భక్తుడు పేర్కొన్నాడు.

ఇల్లంతకుంట/ రుద్రంగి, మే 22: జిల్లాలో హన్మాన్ పెద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వీధులన్నీ హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామంలోని ఆలయంలో గ్రామస్తులకు అన్నదానం చేశారు. అనంతరం మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాన్ని మామిడి, అరటి ఆకులతో అలంకరించి ఉదయం నుంచే అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చెర్మన్ గట్ల మీనయ్య, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.